

మహానాడు వేదికపై సీఎం చంద్రబాబు, లోకేశ్ మధ్యలో బక్కని నర్సింహులు

బాబు పక్కనే బక్కని

మహానాడులో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యేకు సముచిత స్థానం

షాద్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మహానాడులో షాద్‌నగర్‌కు అత్యంత ప్రాధాన్యత లభించింది. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎంను కలవడానికి ఎంతోమంది ప్రయత్నించారు. కానీ భద్రత సిబ్బంది కారణాల వల్ల ఆయనను కలువలేకపోయారు. కానీ షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు మాత్రం బుధవారం కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో స్టేజీ పైన ఏపీ సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ మధ్యలో కూర్చోబెట్టుకొని ఆయనకు సముచిత స్థానం కల్పించారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం తన తనయుడికి బక్కని నర్సింహులు గురించి వివరిస్తూ... మీ తాత గారు ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు పార్టీ కోసం అంకిత భావంతో పని చేస్తున్నారని, కానీ ఏనాడూ పదవులు కావాలని అడగలేదని, ఇలాంటి నాయకులు ఉండటం వల్లనే టీడీపీ ఉనికి కోల్పోకుండా ఉందని వివరించారు. తండ్రి చెప్పింది విని బక్కనిని లోకేష్ అభినందించారు.

ఆహారం కోసం అన్వేషణ





షాద్‌నగర్ పరిధిలోని కొత్తూర్‌లో నల్ల కొంగలు సందడి చేశాయి. ఓ చెరువు వద్ద ఆహారం కోసం అన్వేషణ సాగించాయి. వాటి కడుపు నిండగానే గుంపులుగా ఆకాశంలో విహరించి ప్రకృతి ప్రేమికులను అలరించాయి. నల్లని మబ్బులు కమ్ముకున్నా వరుస కట్టి ఎగురుతున్న నల్ల కొంగలను చూసి పలువురు సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

కల్తీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

» కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కల్తీ విత్తనాలు, ఎరువులు, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సి. నారాయణరెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విత్తన టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్తీ విత్తనాలు అరికట్టడానికి జిల్లా స్థాయిలో రెండు టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు, ఇంటర్ డివిజనల్ స్క్వాడ్‌లు, మండల స్థాయిలో మండల వ్యవసాయాధికారులు, పోలీసు అధికారులతో టీమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎరువులను అధిక ధరలకు అమ్మితే, కల్తీ ఎరువులను సరఫరా చేస్తే సహించేది లేదన్నారు. ఎరువుల షాపులలో లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ రిజిస్టర్, యూరియా, డీఏపీ, తదితర పురుగుల మందులు ఫర్టిలైజర్స్ స్టాకులను సీడ్స్ డీలర్స్ పక్కాగా నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏదైనా సమస్య ఉంటే 9398304336లో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, మండల వ్యవసాయాధికారులు, రాచకొండ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్, రాజమౌళి, సంతోష్‌కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సిద్ధం కావాలి

వర్షాకాలం మొదలైనందున వనమహోత్సవానికి సిద్ధం కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, వ్యవసాయ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఆర్‌డీఏ 41,72,710, విద్యాశాఖ 89,428, అటవీశాఖ 9,53,757, మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, అటవీ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, డీఆర్డీఎ పీడీ శ్రీలత, డీపీవో సురేష్ మోహన్, మున్సిపల్ కమిషనర్లు, ఎక్సైజ్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దారికి తేరా?

ఉమ్మడి జిల్లాలోని రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. ఏళ్ల తరబడి ఆర్అండ్‌బీ రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అడుగుకో గుంత.. గజానికో గొయ్యి ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. ఈ దారుణ దారులపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. గుంతలమయమైన రోడ్లపై బైకులు నడిపితే నడుం విరగ్గొట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కంకర తేలిన రోడ్లతో కార్లు, బైకులు మరమ్మతులకు గురై ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఇక వర్షం పడితే చాలు చిత్తడిగా మారి రోడ్లపై వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో రోడ్ల మరమ్మతుల్లో తీవ్ర జాప్యం జరగడం, కొన్ని ప్రాంతాల్లో ప్రతిపాదనలకే పరిమితం కావడం, మరి కొన్నిచోట్ల శంకుస్థాపనలు చేసి వదిలేయడంతో రోడ్లన్నీ దరిద్రంగా దర్శనమిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో నరకప్రాయంగా రోడ్లు



జీటీకి నోచని షాద్‌నగర్-కేశంపేట రోడ్డు

- అడుగుకో గుంత.. గజానికో గొయ్యి
- మరమ్మతులకు నోచని రహదారులు
- నిధులున్నా జరగని నిర్మాణ పనులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఆమనగల్లు : జంగారెడ్డిపల్లి -చంద్రాయన్‌పల్లి రోడ్డు ఇలా..

రంగారెడ్డి అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 934 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయి. తక్షణ మరమ్మతులు చేపట్టాల్సినవి 500 కిలోమీటర్లు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరైనప్పటికీ.. బిల్లులు పెండింగ్ ఉండటంతో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో రోడ్ల మరమ్మతులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో కొన్నిచోట్ల రోడ్ల విస్తరణకు నోచుకోవడం లేదు. మరికొన్ని శంకుస్థాపన చేసి వదిలేశారు. పనులు ప్రారంభించిన చోట ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దేవరాంపల్లి నుంచి ఆలూరు వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. నాలుగేళ్ల నుంచి రెండు పర్యాయాలు టెండర్ ప్రక్రియ చేపట్టినా కాంట్రాక్టర్ ఎవరూ ముందుకు రాలేదు. దీంతో రోడ్డు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వికారాబాద్ జిల్లా కొడంగల్

మిగతా 7వ పేజీలో...

పూర్తికాని సర్వే..

మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 56 కిలోమీటర్ల మేర 24 రోడ్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతు కోసం రూ.34 కోట్లు మంజూరయ్యాయి. హ్యామ్ పద్ధతిలో జిల్లాలో ఆర్అండ్‌బీ అధికారులు 46 కిలోమీటర్లు, పీఆర్ అధికారులు 140 కిలోమీటర్లకు ప్రతిపాదనలు పంపారు. ఇంకా సర్వే పనులు పూర్తి కాలేదు. సర్వే పూర్తయితే అనుమతులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో కొత్త రోడ్ల నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టలేదు. గతంలో నిర్వహించిన కొన్ని రోడ్ల పనులకు కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు.

ఏళ్ల తరబడి నిలిచిన పనులు..

యాచారం మండల కేంద్రం నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు రూ.78 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులు మూడున్నరేళ్లుగా నిలిచిపోయాయి. యాచారం నందివనపర్తి- మేడిపల్లి మధ్య రహదారి నిర్మాణం కోసం రూ.48 కోట్లు మంజూరైనా పనులు సాగడం లేదు.

కొత్తపల్లిలో డ్రోన్ల కలకలం

పంట పొలాలపై చక్కర్లు

యాచారం, మే 28(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం కొత్తపల్లి గ్రామంలో బుధవారం రాత్రి డ్రోన్ల కలకలం రేపింది. రాత్రి పదిన్నర గంటల నుంచి 11.30 గంటల వరకు గ్రామంలో, వ్యవసాయ పొలాల్లో పది డ్రోన్లు చక్కర్లు కొట్టాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. మూడు నెలల క్రితం ఇలాగే మొండిగౌరెల్లి గ్రామంలో డ్రోన్లు తిరిగిన తర్వాత భూముల సేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, మా గ్రామంలో కూడా అసైన్డ్, పట్టా భూములు తీసుకుంటారేమో అని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



బైర్కాన్‌పల్లిలో ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్

కేశంపేట, మే 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 53/1లో ఉన్న ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ పనులు చేయించారు. ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేయాలని కేశంపేట తహసీల్దార్ మీర్ అజాంఅలీని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కేశంపేట రెవెన్యూ అధికారులు బుధవారం ఆ భూమిలో కొంతమేర కడీలు పాతించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కేశవులు పనులను పర్యవేక్షించారు. అయితే ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ చేస్తే వెనుకాల ఉన్న వారికి బాటలేక అవస్థ పడాల్సి వస్తుందని బైర్కాన్‌పల్లి రైతులు తహసీల్దార్‌కు విన్నవించారు. తమకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

కుక్కల దాడిలో 40 జీవాల మృతి



» ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు

మహేశ్వరం, మే 28 (ఆంధ్రజ్యోతి) : గొర్ల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 40 గొర్లు మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని డీజీ తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన డాక్యానాయక్ అనే రైతుకు సుమారు 70కి పైగా గొర్లు ఉన్నాయి. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి గొర్లను పాకలో కట్టేసి ఉంచాడు. బుధవారం తెల్లవారుజామున వచ్చి చూసేసరికి 40 గొర్లను వీధి కుక్కలు కొరికి చంపినట్లుగా గుర్తించిన డాక్యానాయక్ బోరున విలపించాడు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ లీడ్ ఇండియా ట్రస్టు ద్వారా డాక్యా నాయక్ కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. గొర్ల విలువ సుమారు రూ.4 లక్షలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆదుకొని తమకు న్యాయం చేయాలని బాధిత రైతు వేడుకున్నాడు.

షాద్‌నగర్‌లో తిరంగా ర్యాలీ

ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత త్రివిధ దళాలకు మద్దతుగా బుధవారం షాద్‌నగర్ పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. చౌరస్తా నుంచి ప్రారంభమైన తిరంగా యాత్ర పట్టణ ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. ఈ ర్యాలీలో పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేత పట్టుకుని దేశానికి, జవాన్లకు జైకొడుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్, పార్టీ షాద్‌నగర్ ఇన్‌చార్జి అందె బాబయ్య, వీహెచ్‌పీ నేత బండారి రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగిళ్ళ గోపాల్‌గుప్త, ఐఎంఏ నాయకులు డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్‌సాయికుమార్, రిటైర్డు ఆర్మీ షాద్‌నగర్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి)





విస్లావత్ బాబ్య (ఫైల్)

సౌదీ అరేబియాలో జిల్లా వాసి మృతి

గుండెపోటుతో మరణం

హెమ్లాతండాలో విషాదఛాయలు

చౌదరిగూడ, మే 28(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో మండలవాసి గుండెపోటుతో మృతి చెందాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వాచ్య తండా పంచాయతీలోని హెమ్లాతండాకు చెందిన విస్లావత్ బాబ్య (50) బతుకుదెరువు కోసం ఏడేళ్ల క్రితం సౌదీకి వెళ్లాడు. గత సంవత్సరం క్రితం కూతురు పెళ్లి చేయడానికి బాబ్య సొంతూరికి వచ్చాడు. వివాహం అనంతరం తిరిగి సౌదీ అరేబియాకు వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం లేబర్‌గా పనిచేస్తున్న బాబ్యకు గుండెపోటు రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కూతురు పెళ్లికి చేసిన అప్పులు తీర్చడానికి సౌదీకి వెళ్లి మృతి చెందడంపై తండాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని తండాకు రప్పించడానికి అధికారులు, నాయకులు కృషి చేయాలని కుటుంబ సభ్యులు కోరారు.

షాదీఖానా నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

- రూ.లక్షలు వెచ్చించినా పూర్తి కాని వైనం
- చొరవ చూపని ప్రజాప్రతినిధులు
- పిచ్చి మొక్కలతో కళావిహీనం



8

ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి

» రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

» మంచాల ప్రభుత్వ పాఠశాల సందర్శన



మంచాల ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి, పద్మజ జ్యోత్స్న

మంచాల, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి చేస్తామని రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యురాలు పద్మజ జ్యోత్స్నతో కలిసి బుధవారం మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించబడుతున్నాయని చెప్పారు. నిపుణులైన అధ్యాపకులచే విద్యాబోధన జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎంతో మంది ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారన్నారు. వచ్చే నెల 6న ఇక్కడి పాఠశాలలో స్థానికంగా ఉన్న యువతీయువకులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. తదుపరి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాందాస్, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ రుబియానా, సలీం, సీఆర్‌పీలు జగదీష్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల నిరసన

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల, మే 28(ఆంధ్రజ్యోతి): పని నెపంతో ఆర్టీసీ కార్మికులపై డిపో మేనేజర్ వేధింపులను నిరసిస్తూ విశాల జేఏసీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం డిపో ఎదుట బుధవారం కార్మికుల ఎర్రబాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికులపై విపరీతమైన పనిభారం మోపుతూ, ఇబ్బందులకు గురిచేస్తున్న డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ శ్రీనివాస్, కో-కన్వీనర్ చందర్, జంగయ్య, రజాక్, సత్తయ్య, పరమేష్, మల్లేష్, శ్రీశైలం, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.





నాడు మాటిచ్చి.. నేడు నెరవేర్చా

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ/నందిగామ, మే 28(ఆంధ్రజ్యోతి): నాడు పార్టీ నాయకుడిగా గిరిజన మహిళకు మాటిచ్చి.. నేడు ఎమ్మెల్యేగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం మల్కపహాడ్, వాచ్చతండా, హెమ్లతండా, రుక్కాలితండా, చింతకుంట తండా, జిల్లేడ్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్కపహాడ్ తండాలో 2023 ఆగస్టు 9న పల్లె నిద్రలో భాగంగా గిరిజన మహిళ శివమ్మ ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో మాట ఇచ్చి.. నేడు షాద్‌నగర్ ఎమ్మెల్యేగా గెలిచి నీకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, చంద్రశేఖర్, రజిత, వెంకట్‌నర్సింహ, సత్యనారాయణరెడ్డి, గోబ్రానాయక్, సలీం, తహసీల్దార్ జగదీశ్వర్, ప్రవీణ్‌కుమార్, వంశీకృష్ణ, పాల్గొన్నారు. నందిగామ మండలం చాకలిగుట్ట తండా, తాటిగడ్డ తండా, రంగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. తాటిగడ్డతండాలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రంగాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. జంగనర్సింలు, శివశంకర్‌గౌడ్, మంజుల, రాజునాయక్, గబ్రు, రవిందర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, తుసీరాంనాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ముదిరాజ్‌ల అభివృద్ధి

కొత్తూర్ : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిచారని, ముదిరాజ్‌లకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో రూ.15లక్షలతో నిర్మించిన ముదిరాజ్ భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో రూ.17లక్షలతో సీసీ రోడ్డు పనులు, ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ముదిరాజ్ భవనానికి తనవంతు సహాయ సహకారాలు అందించిన కాంగ్రెస్‌నాయకుడు శేఖర్‌గుప్తాను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆగీర్ రవికుమార్‌గుప్త, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, ముదిరాజ్ సంఘం నాయకులు అంచె రాములు, మంగవెంకటేష్, పంతులు నర్సింహ, బాబు ముదిరాజ్, కేశమోని రమేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, అంబటి ప్రభాకర్‌ముదిరాజ్, ఖాజాపాషా పాల్గొన్నారు.


చౌదరిగూడ : మల్కపహాడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఉపాధి కరువై కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం

చేవెళ్ల, మే 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేవెళ్లలో నిర్వహిస్తున్న జనసేవాదళ్ రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం 'భారత ఆర్థిక వ్యవస్థ-పరిణమాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే నాలుగో స్థానానికి చేరుకుందని చెబుతోందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అంతకుముందు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ మతోన్మాద శక్తులు పెచ్చరెల్లిపోతున్నాయని చెప్పారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెప్పడానికి ముమ్మర యత్నం చేస్తుందని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపడం లేదన్నారు. జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేశ్, జాతీయ జనసేవాదళ్ ఇన్‌స్ట్రక్టర్ మురళి, కేరళ ఇన్‌స్ట్రక్టర్ టీజీ విష్ణు, తెలంగాణ ఇన్‌స్ట్రక్టర్ గోష్క మోహన్, నాయకులు మారుపాక అనిల్, సీపీఐ రాష్ట్ర సభ్యులు రామస్వామి, ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వండ్ల సత్యనారాయణచారి, మండల కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, జంగయ్య, శ్రీనివాస్, నాయకులు మక్బూల్, అంజయ్య, సుధాకర్‌గౌడ్, మీనాక్షి, జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి






చేవెళ్లలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

● టీడీపీ సీనియర్ నాయకుడు సుభాన్‌గౌడ్

చేవెళ్ల, మే 28(ఆంధ్రజ్యోతి): నందమూరి తారకరామారావు సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అన్న నినాదంతో టీడీపీని స్థాపించి ఉమ్మడి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని టీడీపీ జిల్లా సీనియర్ నాయకుడు కాసుల సుభాన్ గౌడ్, చేవెళ్ల మండలాధ్యక్షుడు లొంక రాములుగౌడ్ అన్నారు. బుధవారం మాజీ సీఎం, దివంగత నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా చేవెళ్లలో ఆయన చిత్రపటానికి పూలతో నివాళులర్పించి కేక్ కట్ చేశారు. పటేల్ పట్వారీ వ్యవస్థలను పూర్తిగా రద్దుచేసి పేద ప్రజలకు ఎన్టీఆర్ న్యాయం చేశారని చెప్పారు. టీడీపీ ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. అంతకుముందు చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు కాసుల అశోక్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు రాజుగౌడ్, జీ.కృష్ణ, సుధాకర్, కృష్ణ, అంజయ్య తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

రంగారెడ్డి అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ యాలాల మహేశ్వర్‌రెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. ఉద్యమ కారులను గుర్తించి గుర్తింపు కార్డులు, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసంలో 20 శాతం ఉద్యమ కారులకు కేటాయించాలని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక విభాగంలో వెయ్యి ఉద్యోగాలు కల్పించి ఉద్యమ కళాకారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

విద్యారణ్యపురిని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మే 28(ఆంధ్రజ్యోతి): విద్యారణ్యపురిని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పరిగిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తోందన్నారు. పరిగి విద్యారణ్యపురిలో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చేవిద్యా సంవత్సరం నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, ఇ.కృష్ణ, యాదవరెడ్డి, కె.సత్యనారాయణ, అయ్యూబ్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌పవార్ పాల్గొన్నారు.

దేవరయంజాల్‌లో కల్తీ కల్లును అరికట్టాలి


శామీర్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధి దేవరయంజాల్‌లో విచ్చలవిడిగా అమ్ముతున్న కల్తీకల్లును అరికట్టాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రామ్‌మోహన్ ఎక్సైజ్ అధికారులను కోరారు. బుధవారం ఆయన మేడ్చల్‌లోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్థానికులు కల్తీ కల్లును తాగి అనారోగ్యం బారిన పడుతున్నారని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

దశలవారీగా ఇందిరమ్మ బిల్లులు

శామీర్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న వారికి దశలవారీగా అధికారులు బిల్లులు చెల్లిస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకుడు గడ్డం రమేశ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పొన్నాల్‌లో అధికారులు 80మందికి ఇళ్లను మంజూరు చేశారన్నారు. బిల్లులు వస్తాయో రావోననే అనుమానం పెట్టుకోకుండా మంజూరైన వారంతా ఇంటి నిర్మాణం చేపడితే డబ్బు వస్తాయని తెలిపారు.

బీసీ గణన లెక్కలను బహిర్గతం చేయాలి

తాండూరు, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని వెంకట్‌యాదవ్ అన్నారు. బుధవారం తాండూరులో న్యాయవాది గోపాల్‌నివాసంలో బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, సయ్యద్ షూకుర్, యాదయ్య, అరుణ్‌కుమార్, జిలానీలతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన లెక్కలను, వాటి వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. రాబోయే రోజుల్లో బహుజనులంతా ఏకమై రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని కోరారు.








మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పది సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలపై బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లాలో 20 పరీక్ష కేంద్రాల్లో 5,308 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరిగిలో 3, తాండూరులో 7, కొడంగల్‌లో 1, వికారాబాద్‌లో 5, మోమిన్‌పేట్‌లో 2, కుల్కచర్లలో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర మందులతోపాటు, ఏఎన్ఎంలను నియమించాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలని, కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో రేణుకాదేవి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కమిషనర్ గారూ... జర చూడండి!'

మేడ్చల్ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): 'కమిషనర్ గారూ.. నమస్తే.. వర్షాలు పడుతున్నాయి. డెంగ్యూ, కరోనా విష జ్వరాలు ప్రబలకుండా మీరు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు జాగ్రత్తలపై వివరించండి.' అని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి బుధవారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. మేడ్చల్ పట్టణంలోని కొన్ని ప్రాంతాలు బురదమయం అయ్యాయని పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ కమిషనర్‌కు ఫోన్ చేశారు. పరిసరాలు అపరిశుభ్రం కాకుండా, జ్వరాలు ప్రజలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా ఎమ్మెల్యే అధికారితో ప్రాధేయపడుతూ ఫోన్‌లో మాట్లాడడంపై వీడియో చూసిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

వికారాబాద్, మే28(ఆంధ్రజ్యోతి): వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలలో ధాన్యంను తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ని తన చాంబర్‌లో బుధవారం వరి ధాన్యం సేకరణ ధాన్యాన్ని మిల్లర్లకు చేరవేయటం, రవాణ సదుపాయం తదితర అంశాల పై కలెక్టర్ సంబంధిత అధికారులో సమీక్ష నిర్వహించారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుతుపవనాలు ముందుస్తుగా ప్రవేశించినందున వర్షాలు కురియటం వల్ల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఆరబెట్టటం రైతులకు ఇబ్బందిగా మారిందనివ ఆయన అన్నారు. దీని కారణంగా ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉండి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన అన్నారు. రైతులకు నష్టం జరుగకుండా ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన సదుపాయలు కల్పించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలంలో ట్యాంక్ నిర్మాణం వద్దు

మేడ్చల్ టౌన్, మే 28(ఆంధ్ర జ్యోతి): మేడ్చల్‌లోని జెడ్పీ బాలుర పాఠశాల స్థలంలో ట్యాంకుల నిర్మాణం చేయొద్దని బుధవారం పలువురు పూర్వ విద్యార్థులు తహసీల్దార్ సునిల్‌కు వినతి పత్రం ఇచ్చారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆడుకోవటానికి మైదానం లేకుండా చేసి అధికారులు నీటిట్యాంక్ నిర్మాణానికి పూనుకోవడం శోచనీయమని వారన్నారు. తమ పూర్వీకులు పాఠశాల కోసం స్థలాన్ని ఇచ్చారని, ఈ స్థలంలో చదువుసంధ్యేలే కొనసాగాలి తప్ప వేరే వాటికి ఆ స్థలాన్ని వినియోగించొద్దని కోరారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌స్వామి, భద్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు



నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఓటరు జాబితాపై సమావేశం

కొడంగల్, మే 28(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాపై తహసీల్దార్ బీ.వి జయ్‌కుమార్ రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. బుధవారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఓటరు నమోదు గురించి చర్చించారు. పోలింగ్ బూత్‌లకు బూత్ లెవల్ అసిస్టెంట్‌లను నియమించుకోవాలని సూచించారు. అనిత, వివిధ పార్టీలనాయకులు పాల్గొన్నారు.

పశువులకు అంబులెన్స్‌ల ద్వారా సేవలందించాలి

పరిగి,మే 28(ఆంధ్రజ్యోతి):పరిగిలోని పశుసంవర్ధకశాఖ 1962 అంబులెన్స్‌ను మంగళవారం 1962 అంబులెన్స్ అధికారి బాగేశ్‌మిశ్రా, ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాలు, మందులను పరిశీలించారు. అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వారు మాట్లాడుతూ.. అంబులెన్స్‌లో గ్రామాలకు వెళ్లి పశువులకు సేవలందించాలని సూచించారు. ఏక్కడి నుంచైనా సమాచారం రాగానే స్పందించాలని ఆయన చెప్పారు.


అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న అధికారి బాగేశ్ మిశ్రా

డబ్బులిస్తేనే రుణాలిప్పిస్తా!

రంగాపూర్ వీవోఏ చేతివాటం

చర్యలు తీసుకోవాలని మహిళల ఆందోళన

పరిగి, మే 28(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలిప్పటించడంలో కింది స్థాయి సిబ్బంది డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులిస్తే రుణాలిప్పిస్తామని చెప్పి డబ్బు వసూలు చేస్తున్నారు. రంగాపూర్ వీవోఏ యాదయ్య తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 15 సంఘాలున్నాయి. ఐదు సంఘాల వారికి రూ.5లక్షల నుంచి రూ.20లక్షల రుణాలిచ్చారు. సభ్యులు తమకు రుణం వొద్దని చెప్పినా మంజూరు చేయిస్తున్నాడని మహిళలు వాపోతున్నారు. తీరా లోన్ తీసుకున్న తర్వాత రూ.లక్షకు రూ.వెయ్యిచొప్పున తనకు కమిషన్ ఇవ్వాల్సిందేనని వీవోఏ వసూలు చేస్తున్నాడని మహిళలు చెబుతున్నారు. వీవోఏ యాదయ్య 15ఏళ్ల నుంచి ఇలాగే డబ్బులు దండుకుంటున్నాడని మహిళలు ఆరోపిస్తున్నారు. బుధవారం గ్రామంలో ఆందోళన సైతం వ్యక్తం చేశారు. మహిళల పట్ల అసభ్యకరంగానూ ప్రవర్తిస్తుంటాడని చెప్పారు. ఎవరికి చెప్పుకున్నా తనకేం భయం లేదని బెదిరిస్తున్నాడని మహిళలు వాపోతున్నారు. అధికారులు ఈ అవినీతి, మహిళలకు మర్యాద ఇవ్వని వీవోఏపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఏపీఎం శ్రీనివాసరెడ్డిని స్పందన అడగ్గా.. వీవోఏకు డబ్బులు ఎవరిచ్చారో చెప్పాలని కోరగా ఎవరూ ముందుకు రావడం లేదని, అయినా అతడిపై వచ్చిన ఆరోపణలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సిబ్బంది ఎవరైనా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు.


వీవోఏ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న రంగాపూర్ మహిళలు

సంతకం లేకుండానే రుణం ఇచ్చారు



మాకు రుణం వద్దన్నా.. మా సంతకాలు లేకుండానే లోన్ మంజూరు చేయించాడు. తీరా లక్షకు రూ.వెయ్యి చొప్పున మహిళల నుంచి వసూలు చేశాడు. ఎందుకని నిలదీస్తే పైఅధికారులకు ఇవ్వాలని చెబుతున్నాడు. అలాగే ఈ వీవోఏ మహిళలతో అసభ్యకరంగా మాట్లాడుతూ అవమానిస్తున్నాడు. అతడిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

- సరిత, సంఘం సభ్యురాలు

దారికి తేరా?


తాండూరు మండలం గౌతాపూర్ నుంచి కొల్లాపూర్ వరకు రోడ్డుపై దుమ్ము

(ఐదో పేజీ తరువాయి)

నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.1100కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా, కొన్నిచోట్ల పనులు ప్రారంభం కాగా, మరికొన్ని టెండర్ దశలో ఉన్నాయి. ఇవే కాకుండా ఎస్డీ ఎల్‌డీఎఫ్ కింద ఐదు పనులు మంజూరు కాగా, కొడంగల్ పరిధిలో రూ.27.87 కోట్లతో మూడు రోడ్లు, తాండూరులో రూ.5 కోట్లు, పరిగిలో రూ.6 కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నాన్‌ప్లానింగ్ కింద రూ.5.50 కోట్లతో మూడు పనులు, సీఆర్ఎఫ్ కింద రెండు పనులకు రూ.60కోట్లు మంజూరయ్యాయి. హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) పద్ధతిలో రోడ్ల అభివృద్ధికి జిల్లా పరిధిలో రూ.9 కోట్ల అంచనా వ్యయంతో 45 కిలోమీటర్లు గుర్తించారు. రోడ్ల పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఒక్కొక్కరికీ రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేపట్టడానికి ఆసక్తి చూపడం లేదంటున్నారు.

శంకుస్థాపన చేసి వదిలేశారు

మొయినాబాద్ మండలం రెడ్డిపల్లి రోడ్డు బీటీకి మోక్షం కలగడం లేదు. బీఆర్ఎస్ హయాంలో శంకుస్థాపన చేసి వదిలేశారు. నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోయాయి. వికారాబాద్ జిల్లా పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలోని గడిసింగాపూర్, రంగారెడ్డిపల్లి రోడ్డు విస్తరణ కోసం రూ.340 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణానికి శంకుస్థాపన చేశారు కానీ.. పనులు ఇంకా ప్రారంభించలేదు.

విస్తరణకు నోచని రోడ్లు

మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ నుంచి తంగెడపల్లి వరకు ఉన్న రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ స్టేజి నుంచి ఎర్రన్నగూడ వరకు కొత్తగా బీటీ రోడ్డు మంజూరైంది. కానీ.. పనులు మాత్రం ప్రారంభం కాలేవు.

నత్తనడకన మరమ్మతులు

షాబాద్ మండలంలో మద్దూరు గేట్ నుంచి నాగరగూడ వరకు 9 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు ఐదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్ గ్రామంలో సీసీ రోడ్డు వేశారు. ఈ రహదారిలో అక్కడక్కడ కల్వర్టులు నిర్మాణం చేశారు. కాగా కాంట్రాక్టరుకు మొదటి విడతగా రూ.20 కోట్ల నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇబ్రహీంపట్నం మండల పరిధి చెర్లపటేల్‌గూడ- కందుకూరు మండలం రాచులూరుల మధ్య 18 కిలోమీటర్ల పొడవునా ఏడు మీటర్ల వెడల్పుతో రూ.30 కోట్ల వ్యయంతో రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

దుమ్ము ధూళితో అవస్థలు

తాండూరు మండలం గౌతాపూర్-కొత్తపూర్ మధ్య రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రోడ్డుపై దుమ్ము, ధూళి చెలరేగి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించారు. ఏడాది కాలంగా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఓ వైపు కంకర, మరో వైపు మట్టి పోసి వదిలేశారు. ఇదే మార్గం ద్వారా కర్ణాటక రాష్ట్రానికి రాకపోకలు సాగుతున్నాయి. మట్టిపోసి వదిలేయడంతో లారీలు వెళ్తున్న క్రమంలో ద్విచక్రవాహనదారులు దుమ్ముతో అవస్థలు పడుతున్నారు.

త్వరలో పూర్తి కానున్న పనులు

షాద్‌నగర్ నుంచి కేశంపేట వరకు రూ.30 కోట్లతో రోడ్డు నిర్మిస్తున్నారు. మరో రెండు వారాల్లో పనులు పూర్తి కానున్నాయి. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ నుంచి మల్లన్నగుట్ట వరకు రూ.10కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు కొనసాగుతున్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

షాద్‌నగర్ నుంచి కిషన్ నగర్, చాంద్రాయణగూడ నుంచి మామిడిపల్లి వరకు రోడ్డు విస్తరణకు రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. షాద్‌నగర్ నుంచి పరిగి రోడ్డు నాలుగు లేన్ల విస్తరణకు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. నిధుల కోసం ఆర్అండ్‌బీ అధికారులు ఎదురు చూస్తున్నారు.

మరమ్మతులకు నోచని రోడ్లు ఇవే..

వికారాబాద్ జిల్లా పరిగి మండలం లాల్‌పహాడ్ నుంచి అంగడి చిట్టంపల్లి, కుల్కచర్ల నుంచి దాదాపూర్, చౌడాపూర్ నుంచి మరికల్, ముజాహిద్‌పూర్ గేట్ నుంచి ఉదయపూర్, లింగంపల్లి నుంచి గండి చెరువు, గడిసింగాపూర్ నుంచి ఇబ్రహీంపూర్, రాకంచర్ల నుంచి కంకల్, పుట్టపర్తి నుంచి అనంతసాగర్, దోమ నుంచి పాలేపల్లి ఐనాపూర్, రంగాపూర్ నుంచి మంచన్నపల్లి, చిట్టంపల్లి నుంచి కంకల్ వరకు ఉన్న రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లు సత్వరమే మరమ్మతులు చేపటాల్సిన అవసరం ఉంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పామెన నుంచి చెన్‌వెల్లి, బస్తేపూర్ వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేవు.


బీటీ లేచి కంకర తేలిన చేవెళ్ల మండలం పామెన-చన్‌వెల్లి రోడ్డు


చెర్లపటేల్‌గూడ- రాచులూరుల మధ్య కంకర పరిచిన రహదారి


కార్యాలయానికి తెచ్చిన ఫర్నిచర్, ఫైళ్లు

ఎంపీడీవో కార్యాలయంలోకి మున్సిపల్ ఆఫీస్

ఘట్‌కేసర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న పాత ఎంపీడీవో కార్యాలయానికి మార్చారు. మండలంలోని అన్ని పంచాయతీలను ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎంపీడీవో కార్యాలయం ఖాళీగా ఉంది. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం ఇరుగ్గా ఉండటంతో మున్సిపల్ కార్యాలయాన్ని ఎంపీడీవో కార్యాలయానికి తరలించారు. కార్యాలయం ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి కమిషనర్ భాస్కర్‌రెడ్డి పూల మాలలు వేసి తన చాంబర్‌లో కూర్చున్నారు. కార్యాలయ ఫర్నిచర్, ఫైళ్లను ట్రాక్టర్లలో కొత్త ఆఫీసుకు తరలిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం విశాల భవనంలోకి మారడంతో అధికారులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లారీలు రాక తూకంలో జాప్యం

ధారూరు, మే28(ఆంధ్రజ్యోతి): లారీలు రాక కొనుగోలు కేంద్రంలో తూకానికి జాప్యమవుతుందని రైతులు జిల్లా సివిల్ సప్లయీస్ డీటీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. నాగసమందర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించగా రైతులు సమస్యలను వివరించారు. 40కిలోల బస్తాకు రెండున్నర కిలోలు తరుగు ఇస్తేనే తీసుకుంటామని మిల్లర్లు అంటున్నారని కేంద్రం ఇన్‌చార్జి యాదయ్య చెబుతున్నాడని డీటీకి వివరించారు. వర్షాలతో వడ్లు నానుతున్నాయని రైతులు వాపోయారు. గురువారం జిల్లా అధికారిని ఇక్కడికి తీసుకొచ్చి సమస్యలు పరిష్కరిస్తానని అధికారి హామీ ఇచ్చారు.

చినుకు పడితే చిత్తడే..

పరిగి, మే 28(ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపల్ పరిధిలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతున్నాయి. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. మున్సిపల్ అధికారులు పాత పరిగిలో రోడ్లు ఉన్నా వాటిపైనే మళ్లీ రోడ్లు వేస్తున్నారే తప్ప, అసలు రోడ్లు లేని కాలనీల గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిగి పట్టణంలోని తిరుమల రెసిడెన్సీ, భవానినగర్, వెంకటేశ్వరకాలనీ, తిరుమలహిల్స్ తదితర కాలనీల్లో వందశాతం పన్నులు వసూలు చేసినా రోడ్లు మాత్రం వేయలేదు. సోమ, మంగళవారాల్లో కురిసిన చిరుజల్లులకు రోడ్లపై నడువలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.


తిరుమలకాలనీలో రోడ్డు దుస్థితి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

నేడు తాండూరులో మెగా జాబ్ మేళా

తాండూరు, మే 28(ఆంధ్రజ్యోతి): తాండూరులో గురువారం నిర్వహిస్తున్న 'మెగా జాబ్ మేళా' ఏర్పాట్లును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరిశీలించారు. 11వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. జిల్లాలోని తాండూరు, కొడంగల్, వికారాబాద్, పరిగి, చేవెళ్ల ప్రాంతాల నిరుద్యోగులకు ఈ మేళాలో అవకాశం కల్పించనున్నారు.. తాండూరులోని వినాయక కన్వెన్షన్‌లో ఉదయం10 నుంచి సాయంత్రం 5గంటల జాబ్ మేళా నిర్వహిస్తారు. యువతీ, యువకులు రిజిస్ట్రేషన్‌కు 8కౌంటర్లను ఏర్పాటు చేశారు. కేపీఆర్ డెవలపర్స్, కేఫ్ కాఫీ డే, క్రీమ్‌స్టోన్, పేటీఎం, జెప్టో, మ్యాక్స్ ప్యాషన్ రీటైల్ తదితర పేరొందిన 52 సంస్థలు, కంపెనీలు ఉద్యోగులను ఎంపిక చేసుకోనున్నాయి. జాబ్‌మేళాలో తాండూరు ప్రాంత నిరుద్యోగులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపికైన వారికి సాధ్యమైనంత వరకు వరకు ఇక్కడే ఆర్డర్ కాపీలిచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. నిరుద్యోగులు భారీ సంఖ్యలో వచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూమి ఒకరిది.. పరిహారం మరొకరికి!

న్యాయం చేయాలంటూ ఆర్డీవోకు బాధిత రైతు వినతి

కందుకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): కందుకూరు, యాచారం మండలాల పరిధిలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో తమకు అన్యాయం జరిగిందని మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన రైతు బుధవారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి విన్నవించారు. ఈమేరకు ముచ్చర్ల మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో రైతు ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. ముచ్చర్ల గ్రామానికి చెందిన బొర్ర భిక్షపతికి ఆయన తండ్రి నుంచి అదే రెవెన్యూ పరిధిలోని 288/1క్యూ నెంబర్‌పై 5 ఎకరాల భూమి సంక్రమించింది. ఆ భూమిని 2006లో అదే గ్రామానికి చెందిన కుందేళ్ల రాములు కౌలుకు తీసుకున్నాడు. భిక్షపతికి కౌలు డబ్బులతో పాటు రూ.30వేల నగదును అప్పుగా ఇచ్చాడు. అయితే, ఆ తరువాత భిక్షపతి డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో గ్రామస్తులతో పంచాయితీ పెట్టించిన రాములు.. భిక్షపతికి తెలువకుండా ఆయనకు ఉన్న 5 ఎకరాల భూమిని 2006లో తనకు భిక్షపతి అమ్మినట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడు. విషయం తెలుసుకున్న భిక్షపతి 2012లో ఇబ్రహీంపట్నం కోర్టును ఆశ్రయించాడు. దాంతో కోర్టు ప్రైవేటు కేసుగా పరిగణించి విచారణానంతరం రాములుపై కేసు నమోదు చేయాలని కోర్టు పోలీసు అధికారులను ఆదేశించింది. అయితే, పోలీసులు నామమాత్రంగా కేసు నమోదు చేసి ఊరుకున్నారు. అసలు పట్టాదారు భిక్షపతి జిల్లా కలెక్టరేట్‌లో 2015లో తనకు అన్యాయం జరిగిందని కేసు దరఖాస్తు చేశారు. 2018లో అప్పటి కలెక్టర్ భిక్షపతికి అనుకూలంగా తీర్పునిస్తూ రెవెన్యూ రికార్డుల్లో రాములు పేరును తొలగిస్తూ భిక్షపతి పేరును నమోదు చేయాలంటూ తీర్పు ఇచ్చారు.


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ముచ్చర్ల రైతులు

అయితే, అప్పటికే రాములు మృతిచెందడంతో అతడి భార్య జంగమ్మ పేరిట స్థానిక రెవెన్యూ అధికారులు విరాసత్ చేశారు. ఇదిలా ఉండగా.. అధికారులు భిక్షపతి పేరుపై కాకుండా రాములు భార్య జంగమ్మ పేరుతో 2023లో ఫార్మసిటీకి తీసుకున్న భూమిపై రూ.కోటీ 25లక్షల పరిహారం మంజూరు చేశారు. విషయం తెలుసుకున్న బాధిత రైతు భిక్షపతి గ్రామస్తులతో కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని ఆర్డీవో జగదీశ్వరెడ్డికి విన్నవించారు.

ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వం : ఆర్డీవో

ముచ్చర్ల రైతు భిక్షపతికి జరిగిన అన్యాయంపై ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా ముచ్చర్ల, మీర్కాన్‌పేట రెవెన్యూలో గతంలో ఫార్మసిటీ పేరుతో సేకరించిన భూములపై కొంత మేరకు రైతులకు అన్యాయం జరిగిందన్నారు. భిక్షపతికి చెందిన భూమిపై న్యాయస్థానంలో తీర్పునిచ్చిన అప్పటి అధికారులు అతడికి కాకుండా రాములు భార్యకు పరిహారం మంజూరు చేశారని, దీనిపై గ్రామ స్థాయిలో సర్వే చేసి సదరు రైతుకు న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు.

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

కందుకూరు రెవెన్యూ పరిధిలో నెలకొల్పనున్న మెస్సర్స్ గాంగే మినరల్స్ సంస్థపై స్థానిక రైతులు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇక్కడ మైనింగ్‌ను ఏర్పాటు చేయడం పట్ల స్థానిక రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని అభిప్రాయం తెలియజేశారు. హైదరాబాద్ నుంచి వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాత్రం ఇక్కడ మైనింగ్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకట్‌నర్సయ్య, తహసీల్దార్ కె.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



- మొయినాబాద్ ఎంపీడీవో సంధ్యారాణి

మొయినాబాద్ రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మొయినాబాద్ ఎంపీడీవో సంధ్యారాణి తెలిపారు. మండలంలో దాదాపు ఇందిరమ్మ లబ్ధిదారుల వెరిఫికేషన్ పూరయ్యిందని, తొందరలోనే లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందించి నిర్మాణాలకు తగిన మార్గదర్శకాలు ఇస్తామన్నారు. ఫైరవీకారులకు తావులేకుండా ఇళ్ల మంజూరు పారదర్శకంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ కమిటీలు, అధికారులు ఐక్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆమె 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ఫేస్ టు ఫేస్

ప్రశ్న: మొయినాబాద్ మండలంలో ఎంతమందికి ఇళ్లు మంజూరయ్యాయి?

జవాబు : మండలంలో అన్ని గ్రామాలతో కలిపి దాదాపు 600 వరకు టార్గెట్‌ను ప్రజాప్రతినిధులు సూచించారు. అందుకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోంది.

ప్రశ్న: లబ్ధిదారుల వెరిఫికేషన్ ఎప్పుడు పూర్తి చేస్తారు?

జవాబు : మొదట పంచాయతీ కార్యదర్శి, అనంతరం ఎంపీడీవో, ఎంపీవో స్థాయి అధికారులు వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఫైనల్‌గా గెజిటెడ్ అధికారుల వెరిఫికేషన్ పూర్తయ్యింది. అర్హుల లిస్టును కలెక్టర్‌కు పంపించిన తర్వాత ఫైనల్ లిస్టును ప్రకటిస్తాం.

ప్రశ్న : ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే నిర్మించుకోవాలా?

జవాబు : ఉన్నతాధికారులు రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ ఇంటిని 66 గజాల్లో నిర్మించుకోవాలి. లబ్ధిదారుడికి నాలుగు విడతల్లో రూ.5లక్షల ప్రభుత్వం అందుతుంది. అదే విధంగా ఇళ్లు మంజూరై ఆర్థిక పరిస్థితి బాగాలేని వారికి ఐకేపీ ద్వారా రుణం రూ.5 లక్షల వరకు కూడా అందిస్తారు.

ప్రశ్న: రాజీవ్ యువశక్తికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జవాబు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నుంచి 1069 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు పాటించి అర్హులైన లబ్ధిదారులకు రుణాలందిస్తాం. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా నిబద్ధతతో అర్హులను గుర్తిస్తాం. సిబిల్ స్కోర్ కూడా ప్రభుత్వ ఆదేశానుసారం పరిశీలించిన తరువాత లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

షాదీఖానా నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

- రూ.లక్షలు వెచ్చించినా పూర్తి కాని వైనం
- చొరవ చూపని ప్రజాప్రతినిధులు!
- పిచ్చి మొక్కలతో కళావిహీనం



నిరుపయోగంగా ఉన్న ఆమనగల్లులోని షాదీఖానా

ఆమనగల్లు, మే 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో షాదీఖానా నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులను పూర్తి చేసి షాదీఖానాను వినియోగంలోకి తేవడంలో ఎవరూ చొరవ చూపడం లేదు. దాంతో షాదీఖానా వినియోగంలోకి రాక పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పట్టణ ముస్లిం మైనార్టీల కోరిక మేరకు రెండు దశాబ్దాల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం షాదీఖానా నిర్మాణానికి మైనార్టీ సంక్షేమం ద్వారా రూ.15లక్షలు మంజూరు చేసింది. తహసీల్దార్ కార్యాలయం వెనుకభాగంలో గల ప్రభుత్వ స్థలంలో నిర్మాణ పనులు చేపట్టారు. ఏడాది తర్వాత మంజూరు చేసిన నిధులతో నిర్మాణం చేపట్టి నిధులు సరిపోక అసంపూర్తిగా వదిలేశారు. అనంతరం 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం షాదీఖానా మిగులు పనులకు మరో రూ.10లక్షలు మంజూరు చేసింది. మళ్లీ పనులు చేపట్టినా నిధులు సరిపోక పనులు నిలిచిపోయాయి. అనంతరం 2013లో అప్పటి ఎంపీ దివంగత మంద జగన్నాథం తన కోటా నుంచి రూ.5లక్షలు కేటాయించారు. ఆ నిధులూ చాలక పనులు పూర్తి కాక షాదీఖానా ప్రారంభానికి నోచుకోలేదు. 2017లో అప్పటి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి మైనార్టీల విన్నపం మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా రూ.5లక్షలు మంజూరు చేయించగా.. కొన్ని పనులు చేపట్టారు. 2023లో మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ రూ.5లక్షలు మంజూరు చేయగా డైనింగ్ షెడ్డు నిర్మాణం చేపట్టారు. నిధులు చాలక పిల్లర్లకే పరిమితమైంది. ఏళ్ల కాలంగా నిర్మించిన షెడ్డు నిర్వాహణ లేక కళావిహీనంగా మారింది. కొన్నిచోట్ల పగుళ్లు కూడా వచ్చాయి. డైనింగ్, కిచెన్ షెడ్లు, బండలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతి, విద్యుదీకరణ వంట పనులు మిగిలిపోయాయి. దాంతో రూ.లక్షలు వెచ్చించి షాదీఖానా నిర్మించినా అసంపూర్తి పనులతో ప్రయోజనం లేకుండా పోయిందని స్థానిక ముస్లిం మైనార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తి పనుల పూర్తికి మరో రూ.50లక్షలు మంజూరు చేయాలని చాలా కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయినా స్పందనా లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మిగులు పనులు పూర్తి చేసి షాదీఖానాను వినియోగంలోకి తేవాలని స్థానిక మైనార్టీలు కోరుతున్నారు.

రూ.50 లక్షలు మంజూరు చేయాలి



ఆమనగల్లు షాదీఖానా అసంపూర్తి పనులకు ప్రభుత్వం రూ.50 లక్షల అదనపు నిధులు మంజూరు చేయాలి. నిధుల మంజూరు గూర్చి ఉన్నతస్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించాం. వెంటనే మంజూరు చేయించి అసంపూర్తి పనులు పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- మహ్మద్ మసూమ్, జామా మసీదు అధ్యక్షుడు, ఆమనగల్లు

పనులను పూర్తి చేయాలి



షాదీఖానా లేక శుభకార్యాలు, వివాహాలు జరిగినప్పుడు ఇబ్బందులు కలుగుతున్నాయి. విధిలేక ఫంక్షన్‌హాళ్లను అద్దెకు తీసుకోవాల్సి వస్తుంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షాదీఖానా అసంపూర్తి పనులతో వినియోగంలో లేక ప్రారంభానికి నోచుకోకుండానే కళాహీనంగా మారింది. ప్రజా ప్రతినిధులు చొవర తీసుకొని అదనపు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించాలి.

- అఫ్జల్, మైనార్టీ నాయకుడు, ఆమనగల్లు



కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

- సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు

ఆదిభట్ల, మే 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఉపాధిహామీ పథకం కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని చేపట్టిన ధర్నాకు కూలీలందరూ తరలిరావాలని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు పిలుపునిచ్చారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లి, ముకునూరు, రాయపోలు, ఎలిమినేడు, కప్పాడు గ్రామాల్లో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధర్నాకు కూలీలందరు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. నాయకులు జంగయ్య, జగన్, గణేష్, ప్రభుదాస్, రమేష్, నరసింహ, రవి తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సమగ్ర ప్రణాళిక

ఆమనగల్లు, మే 28(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ అన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో బుధవారం విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలి

మాడ్గుల, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్విన్, బ్రాహ్మణపల్లి, నల్లచెర్వు గ్రామాల రైతులు ఇర్విన్ వద్ద గల రిజర్వాయర్ కింద భూములు(పొలాలు) కోల్పోతున్నారని, ప్రభుత్వం భూములను తీసుకుంటే మార్కెట్ రేటుకు మూడురెట్లు పరిహారం చెల్లించాలని సీపీఎం, వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నాకు దిగారు. ఉన్న కొద్దిపాటి భూములను కోల్పోతే బ్రతికేది ఎలాగని రైతులు వాపోయారు. రైతులకు తగిన పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పడాల యాదయ్య డిమాండ్ చేశారు. లేని ప క్షంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడగామని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పి.అంజయ్య, జిల్లా కార్యదర్శి జగన్, నర్సింహ, బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దయ్య రైతులకు ఈ సందర్భంగా మద్దతు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ వినయసాగర్‌కు వినతిపత్రం అందచేశారు.

ఆరుతడి పంటల సాగుతో అధిక లాభాలు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కిరణ్‌బాబు

ఆదిభట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆరుతడి పంటల సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌బాబు రైతులకు సూచించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కప్పాడ్‌లో రైతుల ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త కిరణ్‌బాబు మాట్లాడుతూ రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులతో సేద్యం చేయాలని సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను సాగు చేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు. ఆకుకూరలు, కూరగాయలు పండించాలని తెలిపారు. ఇబ్రహీంపట్నం ఏవో విద్యాధరి, ఏఈవో సృజన, రైతులు పాల్గొన్నారు.



వంతెన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జక్కు అనంత రెడ్డి

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

ఆమనగల్లు, మే28(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించి పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతుందని ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి- చెన్నారం రోడ్డులో వాగుపై ఎఫ్‌డీఆర్ నిధులు రూ.50లక్షలతో చేపట్టిన వంతెన నిర్మాణానికి బుధవారం స్థానిక నాయకులతో కలిసి అనంతరెడ్డి భూమి పూజ చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వంతెన నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీటీసీ జంగయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పు రాఘవేందర్, నాయకులు వరికుప్పల మల్లయ్య, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్, హర్షవర్ధన్‌రెడ్డి, తానయ్య, ఏఈ అబిషేక్, పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలు పాల్గొనారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన పెంటయ్య ఇంటి నిర్మాణం ఆర్థిక ఇబ్బందులతో అసంపూర్తిగా నిలిచిపోయింది. చేయూతనందించి ఆదుకోవాలని మాజీ జడ్పీటీసీ, ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌ను కోరగా ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరీయల్‌ను సమకూర్చారు. బుధవారం ట్రస్ట్ సభ్యులు పెంటయ్యకు అందజేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నందమూరి తారక రామారావు 102వ జయంతిని బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.



షాద్‌నగర్ : ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న పాతూరి వెంకట్‌రావు తదితరులు



షాద్‌నగర్ అర్బన్ : ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఆమనగల్లు : నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



కందుకూరు : నివాళులర్పిస్తున్న నాయకులు



కేశంపేట : కొత్తపేటలో నివాళులర్పిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ నాయకులు



ఇబ్రహీంపట్నం : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



కొత్తూర్ : మహానాడులో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో కొత్తూర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు



కేశంపేట : మహానాడుకు తరలివెళ్తున్న నాయకులు

గ్రామాల్లో ఇందిరమ్మ రాజ్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



షాబాద్ : భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

షాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా గ్రామాల్లో ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకువస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని అంతారం, షాబాద్, సంకేపల్లిగూడ, నాగర్‌కుంట, హైతాబాద్ గ్రామాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్‌లతో కలిసి ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసి, లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఎంపీడీవో అపర్ణ, డీటీ మధు, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్లు అక్తర్‌పాష, సంజీవరెడ్డి, మాజీ



ఆమనగల్లు : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న గుర్రం కేశవులు

ఎంపీటీసీలు రవీందర్, చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, ఖాజామియాపటేల్, నరేందర్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, జంగయ్య, లింగం, నాయకులు సుభాష్‌రెడ్డి, రాహుల్‌గుప్తా, ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, చంద్రయ్య, గౌరీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం షాబాద్‌లో పీఏసీఎస్ వద్ద రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందజేశారు.

చేవెళ్ల : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.జనార్దన్ తెలిపారు. మీర్జాగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి భూమి పూజ చేశారు. మాజీ సర్పంచ్ జంగయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



మహేశ్వరం : ప్రొసీడింగ్స్ అందిస్తున్న భాస్కర్‌రెడ్డి

ఆమనగల్లు : పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ కేశవులు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు చంద్రాయన్‌పల్లి తండాలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. నాయకులు రాగ్యానాయక్, శ్రీను నాయక్, శ్రీదర్ నాయక్, హర్యానాయక్, గోపాల్‌నాయక్, మల్లేశ్ నాయక్, రవినాయక్, రమేశ్‌నాయక్, హేమ్లానాయక్, సోమ్లానాయక్, కవిత, గోపినాయక్ ఉన్నారు. అదేవిధంగా ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో లబ్ధిదారులకు మాజీ ఎంపీపీ అనితవిజయ్ మంజూరుపత్రాలు అందజేశారు. నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. విజయ్, విజయ్ రాథోడ్, సురేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మొద్దని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు సిరిగిరిపురంలో ప్రొసీడింగ్స్ అందజేశారు. కూన యాదయ్య, వెంకటేష్‌గౌడ్, పాండునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని పాపిరెడ్డిగూడ మాజీ ఉపసర్పంచ్ అబ్బి సుందరయ్య అన్నారు. పాపిరెడ్డిగూడ, లేమామిడి, సంగెం గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, ప్రభాకర్, భిక్షపతి, రామచంద్రయ్య, అంజనేయులు, ప్రకాశ్‌గౌడ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

యాచారం : నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ చెప్పారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. చౌదర్‌పల్లి, మాల్, కుర్మిద్ద తదితర గ్రామాలలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం అధికారులు లబ్ధిదారులతో భూమి పూజ చేశారు. ఎంపీవో శ్రీలత, కార్యదర్శులు తిరుపతి, వైవీ రాజు తదితరులున్నారు. కాగా మండలంలోని పలు గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు, ఆర్‌సీసీ ఇళ్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించారని, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, కొందరు నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి తమ అనుచర గణాలకు ఇళ్లు కేటాయించడం కోసం పైరవీలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆదిభట్ల : ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందజేస్తుందని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ అన్నారు. మండల పరిధిలోని తులేకలాన్ గ్రామంలో పలువురికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు ఇన్చార్జి ఎంపీడీవో జంగయ్యతో కలిసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్లు లేని అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయన్నారు. గత పాలకులు 10 సంవత్సరాల నుండి ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇండ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. తులేకలాన్ గ్రామానికి మొదటి దఫాలో 37 ఇండ్లు మంజూరయ్యావని తెలిపారు. కార్యదర్శి మల్లేష్, నాయకులు శేషంకర్‌రెడ్డి, పాండు, కృష్ణ, యాదగిరి, మహేందర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.



ఆదిభట్ల : భూమి పూజలో రమేష్ తదితరులు



యాచారం : భూమిపూజలో ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): దేవాలయం నిర్మాణంలో భక్తులు భాగస్వాములు కావాలని చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తంగడ్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయం నిర్మాణంకు చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటించి ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం నగదును అందజేశారు. సభ్యులు సత్యంగౌడ్, రాములుగౌడ్, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చౌదరిగూడ, మే 28(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిధిలోని చెరుకుపల్లికి చెందిన ఇప్పలపల్లి పద్మమ్మ అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. విషయం తెలసుకున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. నగదును తన అనుచరుడు కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత

కేశంపేట, మే 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి ఉదారతను చాటుకున్నారు. గ్రామానికి చెందిన నిరుపేద మహిళ పెళ్లికి పుస్తె, మెట్టెలు అందించారు. గ్రామానికి చెందిన అబ్బి రత్నయ్య-నర్సమ్మల కూతురు శ్వేత వివాహం బుధవారం జరిగింది. మాజీ సర్పంచ్ పుస్తె, మెట్టెలను అందించారు. గ్రామంలోని ఆడబిడ్డల పెళ్లిలకు తనవంతుగా పుస్తె, మెట్టెలను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నాయకులు జంగయ్య, చిన్నారెడ్డి, అబ్బి శ్రీను, నిరంజన్, రవి, నరేందర్ జీ, పాస్టర్ కృష్ణయ్య, దామోదర్, యాదయ్య, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల చేయూత

కేశంపేట మండలం తొమ్మిదిరేకులకు చెందిన శంకరమ్మ-బుచ్చయ్యల కూతురు వివాహం ఈ నెల 30న జరగనుంది. గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీసా కరుణాకర్‌రెడ్డి రూ.9వేలతో నిత్యావసర సరుకులు బుధవారం అందించారు. మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, లాలమోని చంద్రయ్య, గుత్తి శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, పోగుల నర్సింహులు, మురళీ గౌడ్, శివయ్య, రాములు, శివలింగం, నాగిళ్ల చంద్రు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

తలకొండపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ, నాయకులు అండగా ఉంటారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తలకొండపల్లి మండలం వెల్జాలకు చెందిన దుర్గమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలు కుటుంబాన్ని బుధవారం ప్రభాకర్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

సేవలను బట్టే సమాజంలో కీర్తి



మెడికల్ కిట్లు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్/మాడ్గుల, మే 28(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం ముద్విన్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో గర్భిణులకు మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పల వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులతో కలిసి కిట్లు పంపిణీ చేశారు. ఉప్పల ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు. మహేశ్ కుమార్, గోపాల్, మహేశ్, శ్రీశైలం, కృష్ణయ్య, రాములు, ఏఎన్‌ఎం పద్మ, అంగన్‌వాడీ టీచర్లు సునిత, హంసమ్మ, కిష్టమ్మ, ఆశా కార్యకర్తలు శ్యామలమ్మ, జ్యోతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాడ్గుల మండలంలోని అందుగులలో గర్భిణులకు నాయకుడు చిత్తపురం అనిల్ కిట్లు అందజేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం 213రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, అంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్‌లు కోరారు. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి ని చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంలో పాలక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. లేని యెడల ఎంతటి పోరాటానికైన వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.



దీక్షలో జేఏసీ నాయకులు